క్లుప్తంగా

వాహనాల వేలం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రాయదుర్గం సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ మద్యం కేసుల్లో పట్టుబడిన 31 వాహనాలను శనివారం వేలం వేయగా రూ.3.07 లక్షల ఆదాయం వచ్చిందని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11 వాహనాలు, కణేకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో 6 వాహనాలు, గుమ్మఘట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో 11 వాహనాలను అనంతపురం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ వేలం పాటలో 46 మంది పాల్గొన్నారు. బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట ఎస్ఐలు నబీ రసూల్, గురుప్రసాద్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రూ.3.06 లక్షల విలువైన మద్యం ధ్వంసం



మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: రాయదుర్గం సర్కిల్ పరిధిలో పట్టుబడిన రూ.3.06 లక్షల విలువైన మద్యం శనివారం ధ్వంసం చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ణాటక నుంచి రవాణా చేసి అక్రమంగా నిల్వ ఉంచిన, విక్రయించిన మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బొమ్మనహాళ్‌లో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ సమక్షంలో ఎస్ఐలు నబీరసూల్, గురుప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో 56 కేసుల్లో పట్టుబడిన 6,66 లీటర్ల మద్యం ప్యాకెట్లను రోలర్‌తో తొక్కించి, ధ్వంసం చేశారు.

షాబాజ్ దీవాన్ వలి ఉరుసు



షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: కల్లుహోళలో వెలసిన హజరత్ సయ్యద్ షాబాజ్ దీవాన్ వలి ఉరుసు శనివారం వైభవంగా జరిగింది. దర్గా మతపెద్దలు, గురువుల ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు స్వామివారి షంషీర్‌ను ఊరేగించారు. భక్తులు స్వామికి చాదర్‌లు, నూతన వస్త్రాలు పుష్పమాలలు, ఆగరబత్తులు, పిల్లల పేరిట చక్కెర తూకం వేయించి, మొక్కులు తీర్చుకున్నారు. దర్గా నిర్వాహకులు స్వామి షంషీర్‌ను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

పిడుగుపాటుకు గొర్రెల మృతి

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురిలో శనివారం సాయంత్రం పిడుగు పాటుకు గొల్లభాస్కర్ అనే వ్యక్తికి చెందిన ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పిడుగుపాటుకు భాస్కర్ భార్య పార్వతి భయంతో స్పృహ తప్పి పడిపోయింది. సర్పంచు సోమశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని బాధిత గొర్రెల కాపరిని పరామర్శించారు.

రాజస్థాన్ నుంచి సైకిల్‌యాత్ర



సైకిల్ యాత్ర చేపట్టిన మనోజ్‌కుమార్

ఉరవకొండ రూరల్: దేశ ప్రజల శాంతిని కాంక్షిస్తూ రాజస్థాన్‌లోని విరాట్ నగర్‌కు చెందిన మనోజ్‌కుమార్ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం ఉరవకొండకు చేరింది. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ తాను గతేడాది మార్చి 3న సైకిల్ యాత్ర ప్రారంభించానని, హోస్పేట్‌లో తన యాత్ర ముగుస్తుందన్నారు.



అండేపల్లిలో ఫాదర్ ఫెర్రర్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కంబదూరులో జరిగిన బైకు ర్యాలీలో పార్టీ నేతలతో కలిసి పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల, సమన్వయకర్త తలారి రంగయ్య, పార్టీ నేతలు

కదిలింది..జనసాగరం

- సేవ్ ఆర్డీటీకి విశేష స్పందన
- స్వచ్ఛందంగా తరలివచ్చి ర్యాలీకి మద్దతు
- వేలాది బైకులతో 104 కిలోమీటర్లు ర్యాలీ

కళ్యాణదుర్గం: కరువు జిల్లా అనంతలో పేదల పెన్నిధి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఐదున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఆర్డీటీని పరిరక్షించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సేవ్ ఆర్డీటీ కార్యక్రమం బైకు ర్యాలీకి విశేష స్పందన లభించింది. బ్రహ్మసముద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ శెట్టూరు, కుందుర్పి, కంబదూరు మండలాల మీదుగా కళ్యాణదుర్గానికి చేరుకుంది. సుమారుగా 28 గ్రామాలను చుట్టి 104 కిలోమీటర్లు బైకు ర్యాలీ చేశారు. అటు ప్రజలు, ఇటు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా కదిలారు. బైకు ర్యాలీ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. ఆయా మండలాల్లోని గ్రామాలకు బైకు ర్యాలీ చేరుకోగానే ప్రతి ఒక్కరూ సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీకి మద్దతు పలికారు. అడుగడునా ప్రజలు నాయకులకు మద్దతు తెలిపి, ర్యాలీని సాగనంపారు. గ్రామ గ్రామాన ఆర్డీటీ లబ్ధిదారుల కోరిక మేరకు పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ నేతలు తిప్పేస్వామి, ఉమా మహేశ్వర నాయుడులు గ్రామాల్లో ఉన్న ఫాదర్ ఫెర్రర్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, పార్టీ వివిధ విభాగాల కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, హనుమంతరెడ్డి, రామాంజనేయులు, దాదాఖలందర్, నీలిశంకరప్ప, చందనా శివాజీ, ప్రియాంక, నాగలక్ష్మి, సునీత, సంధ్యారాణి, పూజ, ఎంపీటీసీ నాగలక్ష్మి, వివిధ విభాగాల నాయకులు గోపాల్ రెడ్డి, మంజునాథ్, సంజీవ, జిన్నా మల్లి, తిప్పేస్వామి, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, భీమప్ప, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, హరి, దొడగట్ట నారాయణ, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు తిప్పేస్వామి, ఫయాజ్, దాదు, కిరణ్, నరసింహులు, చరణ్, పాతలింగ, భాస్కర్, అఫ్జల్, షేక్షావలి, పాండు, ఇబ్రహీం, అజయ్, ప్రతాప్, రామిరెడ్డి, మల్లికార్జున, తిమ్మారెడ్డి, కిరీటి యాదవ్, కాంతమ్మ, నాయకులు హరినాథ్‌రెడ్డి, కైరేవు గంగాధర్, క్రాంతి, నారాయణస్వామి, మల్లికార్జున, పరంధామరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహాబలి, మల్లేశప్ప, గోపి, విల్సన్, రాజు, అమర్, హరినాథ్, నారాయణస్వామి, కేశవ్ గౌడ్, రాజు, జానీ, జయరామిరెడ్డి, సుబ్బరాయుడు, గంగాధర్, లతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సేవ్ ఆర్డీటీ' బైక్ ర్యాలీకి బ్రహ్మరథం

శెట్టూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ' బైక్ ర్యాలీకి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఊరూరా బ్రహ్మరథం పట్టారు. మండలంలో బసంపల్లి, శెట్టూరు, చింతర్లపల్లి, మాకోడికి, లక్ష్మంపల్లి, కంబాలపల్లి గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ సాగింది. బసంపల్లి వద్ద మండల నాయకులు ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి శెట్టూరులో అంబేడ్కర్, ఫాదర్ ఫెర్రర్ విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమనాథ రెడ్డి, మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, వైస్ ఎంపీపీలు చెవుల కిష్టప్ప, ముత్యాలు, పార్టీ అనుబంధ నాయకులు హరినాథ రెడ్డి, మంజునాథ రెడ్డి, బోయ తిప్పేస్వామి, మహాబలి, మిద్దె సుధాకర్, ప్రతాప్, విజయ్‌కుమార్, చెర్లోపల్లి ప్రకాష్, ఖాసీం, సర్పంచులు గొర్ల గంగాధర, విరూపాక్షి గౌడ్, వెంకటేశులు, సత్యానారాయణ రెడ్డి, నాగరాజు, ప్రకాష్, ఎంపీటీసీలు నరసింహులు, ప్రహ్లా, నాయకులు వీరభద్రప్ప, వీరాంజనేయులు, చటాకులు రామాంజనేయులు, బాలు, టైలర్ వన్నూరుస్వామి, లింగప్ప, గోపి, మన్సూర్, శీన, నాగేంద్ర, శ్రీరాములు, వివిధ గ్రామాల నుంచి మాజీ వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

కళ్యాణదుర్గం: ' సేవ్ ఆర్డీటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నిర్వహించిన బైక్ ర్యాలీని పెద్ద ఎత్తున విజయవంతం చేసి ప్రతి ఒక్కరికీ మాజీ ఎంపీ తలారి రంగయ్య కృతజ్ఞతలు తెలిపారు. మీడియా ద్వారా ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మసముద్రం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, కళ్యాణదుర్గం ఐదు మండలాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా బైక్ ర్యాలీకి వచ్చారన్నారు. శాంతియుతంగా బైక్ ర్యాలీ జరిగిందన్నారు. అన్ని మండలాల కన్వీనర్లకు, ఎంపీపీలకు, జెడ్పీటీసీలకు, ఎంపీటీసీ, సర్పంచ్‌లకు, పార్టీ అనుబంధ నాయకులకు, ప్రజలకు పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



శెట్టూరులో బైకు ర్యాలీ చేస్తున్న తలారి రంగయ్య, పార్టీ శ్రేణులు



సేవ్ ఆర్డీటీ బైక్ ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగుడు రాజేష్ తదితరులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య, పక్కన ఉమ తదితరులు



కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక యెరుషలేము ప్రార్థన మందిరంలో జరిగిన సమావేశంలో రెండేళ్ల కాలానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఐజాక్ శామ్యూల్, గౌరవ ఉపాధ్యక్షుడిగా హెచ్.శామ్యూల్, గౌరవ సలహాదారులుగా టి.సామ్యూల్, పౌలు, రవిచంద్రశేఖర్ బాబు, వీరేష్‌లను ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా జి.జయ చంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా జె.కిరణ్‌కుమార్, కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా విల్సన్‌జాన్, సహాయ కార్యదర్శిగా పౌలు, కోశాధికారిగా ఆనంద్, సంయుక్త కోశాధికారిగా పీటర్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. రాయదుర్గం మండల పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడిగా డేవిడ్ వీరేష్, యోసేపు, హనోకు, గుమ్మఘట్ట మండలశాఖ అధ్యక్షుడుగా మంజునాథ, డి.హీరేహాళ్ శాఖ అధ్యక్షులుగా పులకుర్తి డేవిడ్, సత్యరాజు, బొమ్మనహాళ్ మండలశాఖ అధ్యక్షుడుగా శ్యామ్, కణేకల్లు మండలశాఖ అధ్యక్షుడిగా థామస్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కదలని వరిధాన్యం లారీలు

కణేకల్లు: రబీలో 2,900 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యం విధించగా... లక్ష్యం మేర ధాన్యం సేకరణ పూర్తయ్యింది. అయితే, అదనపు కోటా ఇస్తారన్న నమ్మకంతో సిబ్బంది కణేకల్లు, 43 ఉడేగోళం, బ్రహ్మసముద్రం గ్రామాల్లో 20 లారీల వరిధాన్యాన్ని సేకరించారు. ఈ క్రమంలో ఆ మేరకు కోటా రాకపోవడం, ట్రక్‌షీట్ జనరేట్ కాకపోవడంతో కణేకల్లులో 20 వరకు వరిధాన్యం లారీలు ఆగిపోయాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ విషయమై జిల్లా సివిల్ సప్లయి డీఎం రమేష్‌రెడ్డికి వివరణ కోరగా... ఆదివారం సాయంత్రం వెయ్యి మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరణకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. కణేకల్లులో ఇప్పటి వరకు లోడైన వరిధాన్యాన్ని తీసుకొంటామన్నారు. అదనపు కోటా ప్రస్తుతం లోడైన లారీలకు సరిపోతోందని ఇవికాకుండా అదనంగా లారీలకు వరిధాన్యాన్ని లోడ్ చేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.

స్వచ్ఛ రాయదుర్గంలో భాగస్వాములవుదాం



స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, ప్రజా ప్రతినిధులు, ప్రజలు

రాయదుర్గంటౌన్: స్వచ్ఛ రాయదుర్గం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అవగాహ ర్యాలీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఊపీ ర్యాలీని చైర్‌పర్సన్ ప్రారంభించారు. అనంతపురం రహదారి, లక్ష్మీబజార్ సర్కిల్ మీదుగా పాత మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ స్వచ్ఛత పాటించేలా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, కో ఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్, మున్సిపల్ మేనేజర్ కిశోర్‌బాబు, ఏఈలు ప్రతాప్, నరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, మెప్మా టీపీవో సుబ్బరాయుడు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు, పొదుపు సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత

కూడేరు: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడానికి అందరూ సహకరించాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సూచించారు. శనివారం కూడేరులో స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుళ్లాయిస్వామి మాట్లాడారు. ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మిగిలిన పంచాయతీల్లోనూ ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు ర్యాలీలు చేసి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రంలో సర్పంచ్ లలితమ్మ, ఏపీఓ పోలేరయ్య, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, మహిళా పోలీసులు పుష్పా, వెంకటరమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

బొమ్మనహాళ్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్, గోవిందవాడ తదితర గ్రామాల్లో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. చెత్తను వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ దాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సర్పంచు మోనాలిసా పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సచివాలయం నుంచి మెయిన్‌రోడ్డుమీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం గాంధీ సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేశారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, ఏపీఓ లక్ష్మీకాంత బాయి, ఏఎఫ్ఎం సుకన్య, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఉపాధి టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పచ్చదనం– పరిశుభ్రతకు కృషి చేయాలి

వజ్రకరూరు: పచ్చదనం–పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచు మల్లెల జగదీష్ పిలుపునిచ్చారు. శనివారం చాబాల గ్రామంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై సర్పంచు మల్లెల జగదీష్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో సురేంద్ర, గ్రామ కార్యదర్శి నాగరాజు, వీఏఏ కళ్యాణి, మహిళా పోలీస్ అరుణ, ఆశా కార్యకర్తలు మల్లికా, లింగమ్మ, షెడ్‌గార్డ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బెళుగుప్ప: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ షర్మిళ చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు, స్థానికుల సౌకర్యార్థం వేసవిని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రం ప్రారంభించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ సురేఖ, ఆర్ఐ రమాదేవి, విఆర్ఓలు ఎర్రిస్వామి, ఈశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, కార్యాలయ సిబ్బంది ఆనంద్, కిశోర్, అల్తాఫ్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

కూడేరు: కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి శనివారం ప్రారంభించారు. సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న స్కూటర్

కూడేరు: మండలంలోని గొటుకూరు సమీపంలో అనంతపురం – బళ్లారి ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుక్కరాయసముద్రానికి చెందిన రాజేంద్ర అనే వ్యక్తి గాయపడ్డాడు. రాజేంద్ర ఉరవకొండలో పని చూసుకొని ద్విచక్ర వాహనంపై సొంతూరుకు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక వైపున ఢీకొట్టాడు.

గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటించాలి

కూడేరు: గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలియజేశారు. శనివారం కూడేరు మండలంలోని చోళసముద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వడదెబ్బ తగలకుండా రక్షణ పొందడం ఎలా? అంశంపై అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

బెళుగుప్ప: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏఎస్ఐ రామదాసు తెలిపారు. శనివారం దుద్దేకుంట, తగ్గపర్తి, బెళుగుప్ప గ్రామాల్లో 'బీట్ ద హీట్' కార్యక్రమంతో వేసవిలో జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తగ్గుపర్తి సర్పంచ్ హౌనిక, పంచాయతీ సెక్రటరీలు వర్ల శంకర్, జగదీష్, గ్రామ మహిళా పోలీసులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బెళుగుప్ప: మండలంలో రాబోవు రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ షర్మిళ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు పంట పొలాలకు వెళ్లేటప్పుడు, కాలువలు వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు.

వజ్రకరూరులో భారీవర్షం

వజ్రకరూరు: మండల కేంద్రంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. భారీవర్షం కురవడంతో మెయిన్‌రోడ్డు మీదుగా వర్షపునీరు ప్రవహించింది. వీధులగుండా వర్షపు నీరు చెట్టుకుంటకుపారింది. భారీవర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని రామాంజనేయులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివారల మేరకు.. గాజులపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు వ్యక్తి గత పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై శనివారం కళ్యాణదుర్గానికి వెళ్లి తిరిగి గ్రామానికి వెళ్తుండగా కంబదూరు రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు సీహెచ్‌సీ నంచి మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామికి సుప్రభాతసేవ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదతర పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

అంజన్నకు అభిషేకం



బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారి మూలవిరాట్‌కు పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పురోహితుడు అనిల్‌కుమార్ స్వామి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

ఎక్సైజ్ సీఐపై చర్యలు తీసుకోవాలని నిరసన



కళ్యాణదుర్గంలో నిరసన తెలుపుతున్న రాజకీయ పార్టీ నేతలు, దళిత సంఘాల నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ఎక్సైజ్ కార్యాలయ అటెండర్‌ను చెప్పుతో కొట్టిన ఎక్సైజ్ సీఐ హసీనా బానును వెంటనే సస్పెండ్ చేయాలని రాజకీయ పార్టీ నేతలు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ ఎదుట బాధితుడు సాయితో పాటు రాజకీయ పార్టీ నేతలు, దళిత నాయకులు నిరసన తెలియజేశారు. సంఘాల నాయకులు, రాజకీయ పార్టీ నేతలు మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన సీఐ.. అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. విషయాన్ని బయటపెట్టిన అటెండర్ సాయిపై స్టేషన్‌లో సిబ్బంది సమక్షంలో చెప్పుతో దాడి చేయడం సరికాదన్నారు. కాగా ఘటనపై కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి శనివారం విచారణ చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపామన్నారు. సీపీఐ నాయకులు గోపాల్, దళిత సంఘాల నాయకులు ఆర్‌కే రాజు, తిప్పేనాయక్, అచ్యుత్, తదితర నాయకులు పాల్గొన్నారు.

పెన్నహోబిల రథోత్సవం.. భక్తుల పరవశం



రథం వద్దకు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



ఉగ్ర నారసింహుడి విగ్రహం వద్ద రథోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

- వైభవంగా లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మ రథోత్సం
- ఆంధ్ర, కర్ణాటక నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ఉరవకొండ/ఉరవకొండ రూరల్: పెన్నహోబిల క్షేత్రం భక్తజన సాగరాన్ని తలపించింది. శనివారం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పెన్నహోబిల క్షేత్రం కిటకిటలాడింది. స్వామి బ్రహ్మ రథోత్సవాన్ని తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రథోత్సవం అనంతరం స్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. రథోత్సవంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. భారీ ఊరేగింపు నడుమ స్వామి వారికి పట్టువస్త్రాలు అందించారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, అర్చకుల ఆధ్వర్యంలో మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

రాయదుర్గంలో రథోత్సవ సందడి



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు

రాయదుర్గం: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం సందడిగా సాగింది. సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతుడైన కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం రథంపై కొలువుదీర్చి రథోత్సవం ప్రారంభించారు. ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. తేరుపైకి అరటి పండ్లు విసిరి మొక్కు చెల్లించారు. మహిళల నృత్యాలు, యువకుల నందికోలు నాట్యాలు, కోలాటం, చెక్కభజన ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మడుగుతేరులో పాల్గొని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివా, ఐటీ విభాగం అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కోఆప్షన్ శ్రీనివాసులు, పొరాళ్ల గోవిందరాజులు మోకు లాగారు. స్థానిక పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.